

# రాధాయి పెళ్లి

'అన్నయ్య'

"నాకు పెళ్లి చేస్తావుటే అమ్మా!" అన్నాడు రాధాయి పరుగెత్తుకుంటూ వచ్చి. వాళ్ళమ్మ అప్పుడేకాఫీ డికాక్షను పెట్టి, పాలు కాస్తున్నది.

అయిదేళ్ళ రాధాయికి హఠాత్తుగా పెళ్లిమీద మనసు పోయింది. వాడు పొరుగింటిలో జరుగుతున్న పెళ్లి హడావిడంతా చూశాడు. వీధి ఆవరణలో బంతాట ఆడుకుంటున్న వాడల్లా ఆట ఆపేసి, బంతి చేతపట్టుకొని, అమ్మ దగ్గర కొచ్చాడు.

"నాకు పెళ్లి చేస్తావుటే, అమ్మా!"

"తప్పకుండా చేస్తానురా నాన్నా! నీకు చెయ్యక ఇంకెవరికి చేస్తానూ?" అన్నది వాళ్ళమ్మ. పాలమీద పొంగు తగ్గించటానికి నీటిచుక్క జల్లుతూ.

వాడి ప్రశ్నకి ఆవిడకు పట్టరానంత నవ్వుకూడా వచ్చింది.

"మరేం, నాకు వాళ్ళ సూరీడు నిచ్చిచేస్తే ఒప్పుకోను-ఏమనుకుంటున్నావో - తెలిసిందా?" అన్నాడు రాధాయి. అక్కడే బంతి ఎగరవేస్తూ,

"మా సూరి, మీ రాధాయికోసమే పుట్టింది వదినగారూ!" అంటూ, పక్కింటి 'అత్తయ్య' వాళ్ళమ్మతో ఏదో మాటల సందర్భంలో అనడం.

రాధాయి కెప్పుడూ జ్ఞాపకముంటూనే ఉంటుంది!

"ఏంరా? నీ అందానికి సూరిడు సరిపోలేదుట్రా బాబూ?" అంటూ నవ్వింది వాళ్ళమ్మ.

"ఇప్పుడట్లాగే అంటారులెండి. మీ అమ్మాయికాస్తా పెద్దదై చదువుల సరస్వతయ్యేసరికి, అప్పటి మీ కోరికల ప్రకారం మావాడు ఏ డాక్టరో, ఇంజనీరో కావొద్దూ?" అని వాళ్ళమ్మ జవాబివ్వటం కూడా రాధాయి ఇంత త్వరలో మరిచిపోలేదు.

"మీ వాడు పెద్ద కలక్టరే అవుతాడు లెండి." అన్నది పక్కింటి 'అత్తయ్య'. కలక్టరేమిటి కలక్టరు! మామయ్యటికెట్టుకలక్టరు! ఛీ! అవుతే డాక్టరే కావాలి ఇంచక్కా! లేకుంటే నాన్నారిలా పెద్దఇంజనీరుకావాల్సిందే!

"సూరిడొద్దూ, గీరిడొద్దూ-చింపిరితలా, చీమిడిముక్కూ అదీనీ-అదంటే నాకు అసయ్యం" అన్నాడు రాధాయి ముక్కు తుడుచుకుంటూ.

"సరే, పెళ్లి చేస్తానుగాని, ఆ బంతి అవతలపడేసి కాఫీ తాగటానికి నాన్నారిని పిలుచుకురా," అన్నది వాళ్ళమ్మ.

"అలాకాదు నా కిప్పుడే చెప్పాలి మరి," అన్నాడు రాధాయి. బంతి ఎగురవేస్తూ.

"ఏమిటి చెప్పేది?"

"నా కెప్పుడు చేస్తావు?"

"ఏమిటి చేయటం?"

"పెళ్లే! పెళ్లి!"

"నువు బాగా చదువుకొని, పెద్ద పెద్ద పరీక్షలు పాసయితే, ఎంతో మంది వస్తారు నీకు పిల్ల నిస్తామంటూ - తెలిసిందా? అప్పుడు. నీకు నచ్చిన మంచిపిల్లను చూసి-"

రాధాయి సగంలో అడ్డొచ్చాడు.

"ఊఁ - అల్లాకాదు - నాకు రేపే చేసెయ్యాలి పెళ్ళి-" అన్నాడు రాధాయి గునుస్తూ.

రాధాయి వాళ్ళమ్మ కాఫీకలిపి చల్లారపోస్తున్నది. వాడి అర్థం కాని గునుపు ఆవిడకు చిరాకెత్తించింది.

"నాన్నారిని పిలవరా అంటే?" అన్నది.

"పిలుస్తానుగాని, మరి నాకు రేపే చేసెయ్యాలి పెళ్ళి!" అంటూ. గునుపు సాగతీశాడు రాధాయి. బంతి గట్టిగా నేలకేసికొట్టి ఎగురవేస్తూ.

బంతి ఒక్కసారి ఎగిరి దభీమని కాఫీగిన్నెలో పడింది.

కాఫీ, వాళ్ళమ్మ ముఖం మీద తుళ్ళిపడింది, గిన్నెడు కాఫీ వొలికింది.

కోపం పట్టలేక రాధాయి వీపు మీద వాళ్ళమ్మ ఒకటి చరిచింది.

"అయిందా నీ పెళ్ళి నా పెళ్ళినీ? ఫో, అవతలకి!" అన్నది వాళ్ళమ్మ

ఇప్పట్లో మళ్ళీ పెళ్లి ప్రస్తావన చేయకూడ దనుకున్నాడు-రాధాయి.